# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు కీలకం కానున్న పి.ఎస్.ఎల్.వి-సి 60ను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం దిశగా ఎనభై వేల కోట్ల రూపాయల వ్యయంతో గోదావరి -బనకచర్ల ప్రాజెక్టు చేపడతామని ముఖ్యమంత్రి ఎన్.చంద్ర బాబు నాయుడు ప్రకటించారు.**
3. **మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది**
4. **ఆంధ్రప్రదేశ్‌లో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా తొమ్మిది కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.**
5. **హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ కార్యకలాపాల విస్తరణపై ఆ సంస్థ సి. ఈ. ఓ. సత్య నాదెళ్లతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు.**

============================

భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు కీలకంగా రూపొందనున్న పి.ఎస్.ఎల్.వి. –సి 60 రాకెట్ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ....ఇస్రో ... విజయవంతంగా నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుండి నింగిలోకి దూసుకు వెళ్లిన ఈ వాహక నౌక ..... టార్గెట్ ..., చేజర్ ఉపగ్రహాలను గత రాత్రి 10 గంటల 15 నిమిషాలకు నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది.

పి.ఎస్.ఎల్.వి –సి 60 ప్రయోగం విజయవంతం అయిందని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. ఈ రెండు ఉపగ్రహాలు జనవరి 7 వ తేదీన అనుసంధాన మయ్యే అవకాశం ఉందని సోమనాథ్ వివరిస్తూ..

..వాయిస్..23 సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో "తెలుగు తల్లికి జల హారతి" పేరుతో మరొక భారీ నీటి ప్రాజెక్టును చేపట్టనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వెలగపూడి సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి నీరు అందించవచ్చునని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో బనకచర్ల

ప్రాజెక్టును నిర్మిస్తామని ..., గోదావరి నీటిని నాగార్జున సాగర్ నుండి కర్నూలు జిల్లా బనకచర్ల వద్ద కలపడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యమని ..., ఎనభై వేల కోట్ల రూపాయల మేర వ్యయం కాగల ఈ ప్రాజెక్టుకు "తెలుగు తల్లికి జల హారతి" అని నామకరణం చేస్తున్నామని వెల్లడించారు. బనకచర్ల ప్రాజక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం నదుల అనుసంధానం జరుగుతుందని ..., ఈ ప్రాజెక్టు నివేదికను ప్రధానమంత్రి నరేంద్రమోదీకీ పంపుతున్నామని ..., కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో ఈ అంశంపై ఇప్పటికే చర్చించామని చంద్రబాబు నాయుడు వివరిస్తూ...

..వాయిస్..34 సెకన్లు

---------------------------

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారత రత్న పురస్కారం ప్రదానం చేయాలని కోరుతూ తెలంగాణా అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన ఈ తీర్మానానికి సభలో అన్ని పక్షాల సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి నివాళులు అర్పించేందుకు అసెంబ్లీ నిన్న ప్రత్యేకంగా సమావేశమైంది.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ .... డాక్టర్ మన్మోహన్ సింగ్ అనేక సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా నిలిపారని ..., ఆయన ప్రధానమంత్రిగా వ్యవహరించినపుడే తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు మార్గం సుగమమయిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ...., ఉపాధి అవకాశాలు లభించేలా భారీ పెట్టుబడులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. వెలగపూడి సచివాలయంలో నిన్న జరిగిన రాష్ట్ర స్థాయీ పెట్టుబడుల అభివృద్ధి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి ఇందుకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా 2 లక్షల 63 వేల మందికిపైగా యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ఒక లక్షా 82 వేల 162 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు రానున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు దరఖాస్తు చేసుకున్న అంశాన్ని ఈ సమావేశం సమగ్రంగా చర్చించింది.

---------------------------

దేశంలో ప్రతి రైతు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర వ్యవసాయ ..., గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. తిరుపతి జిల్లా కరకంబాడి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని నిన్న సందర్శించిన అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా... కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ... రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసి వారి అభివృద్ధికి చేయూత నిస్తోందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాదులో నిన్న మైక్రో సాఫ్ట్ ప్రధాన కార్యనిర్వహణాధికారి సత్య నాదెళ్లతో సమావేశమయ్యారు. సత్య నాదెళ్ల నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ...., రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు ..., ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

హైదరాబాదులో నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు ...., ఎ. ఐ. క్లౌడ్ కంప్యూటింగ్ ..., భవిష్యత్ నగరం ఏర్పాటు వంటి అంశాలపై వీరిరువురి మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది. క్లౌడ్ కంప్యూటింగ్ అంశంలో కీలక పాత్ర పోషించాలని సత్య నాదెళ్లను రేవంత్ రెడ్డి కోరినట్టు సమాచారం.

---------------------------

వివిధ రంగాలలో భారత దేశం సాధిస్తున్న అభివృద్ధిని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని కేంద్ర ఆయుష్ ..., ఆరోగ్య ..., కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్ తెలిపారు.

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరుని ఈ రోజు సందర్శించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి ఎన్.డి.ఎ. ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశంలో సమూల మార్పులు జరుగుతున్నాయని ...., కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు వరాలుగా మారుతున్నాయని ప్రతాప్ రావ్ జయదేవ్ పేర్కొంటూ ....

..వాయిస్..25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెరగనున్నాయని రాష్ట్ర రెవిన్యూ ..., రిజిస్ట్రేషన్ వ్యవహారాల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో తన శాఖకు సంబంధించిన అధికారులతో ఈ అంశంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ..... ఏ ఏ ప్రాంతాలలో ఎంత మేర పెంచాలి ..., ఎక్కడ తగ్గించాలనే అంశాలపై రెండు వారాలలో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిపారు.

---------------------------

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాదు పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ రోజు రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు ఐ. టి. కారిడార్‌లలో ఫ్లై ఓవర్ లను మూసివేయనున్నట్టు వారు ప్రకటించారు. బాహ్య వలయ రహదారిపై భారీ వాహనాలు ..., విమానాశ్రయానికి వెళ్ళే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం తెలంగాణా రాష్ట్ర ప్రజాప్రతినిధులు అందజేసే సిఫారసు లేఖలను అనుమతించాలని నిర్ణయించినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు తెలిపారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో నిన్న సమావేశమైన అనంతరం ఆయన మాట్లాడుతూ ... వారానికి రెండు బ్రేక్ దర్శనాలు ..., రెండు మూడు వందల రూపాయల దర్శనానికి సంబంధించి తెలంగాణా ప్రజాప్రతినిధులు అందజేసే సిఫారసు లేఖలను అనుమతించడానికి ముఖ్య మంత్రి అంగీకారం తెలిపారని చెప్పారు.

ఇదిలా ఉండగా ... తిరుమలేశుని దర్శనం కోసం తెలంగాణా ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను

అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణా శాసన సభాపతి గడ్డం ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలంలోని యల్లమంద గ్రామంలో లబ్ధిదారులకు సామాజిక పెన్షన్లు అందజేస్తారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం లబ్ధిదారులతో చంద్రబాబు నాయుడు ముచ్చటిస్తారు..

======================